క్లుప్తంగా

పౌరహక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు గిరిజన కాలనీలో పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్థానికులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఐ నల్లయ్య పౌర హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అలాగే పలు సమస్యలను అధికారుల దృష్టికి స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నందయ్య, డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు, వీఆర్‌ఓ మోహన్, హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో ప్రిన్సిపల్ రూపాదేవి తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీరామ్‌నగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28వ తేదీన తిరుపతిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలలో షాట్‌పుట్ అండర్–16 బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థి జశిత్ హర్ష మొదటి స్థానం సాధించాడు. అండర్–11 బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థి యశస్వి రెండో స్థానం, 7వ తరగతి విద్యార్థి ధృవి 3వ స్థానంలో నిలిచారు. శనివారం ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపల్ రూపాదేవి అభినందించారు. ఏజీఎం సురేష్, కో–ఆర్డినేటర్ బాలాజీ, పీఈటీ మేఘన, ఇన్‌చార్జిలు త్రివేణి, కల్పన పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో 'దేవాంగ' నేతలు



ఆలయం వద్ద నేతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శనివారం దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రమణ్యేశ్వరస్వామి తదితరులు సేవించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, సంఘం యువత అధ్యక్షుడు పులి రామచంద్ర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బంగారు రవి, జగదీష్, హేమసుందర్, నాగరాజు, సుధాకర్, రమేష్, హరి, సుమంత్‌కుమార్, మోహనకృష్ణ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి



బుచ్చినాయుడుకండ్రిగలో మాట్లాడుతున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించేలా బోధన జరగాలని మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం అన్నారు. శనివారం మండలంలోని నెలవాయి, బుచ్చినాయుడుకండ్రిగ, పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలల క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులకు శనివారం మధ్యాహ్నం శిక్షణా కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఫౌండేషన్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యానాదుల రక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న మల్లికార్జునరావు

శ్రీకాళహస్తి: యానాదుల రక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని యానాదుల సంక్షేమ సంఘంవ జిల్లా అధ్యక్షుడుఉ తలప చెంచు మల్లికార్జునరావు స్పష్టం చేశారు. శనివారం శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లె ఎస్టీకాలనీలో సంఘం నేతలతో కలిసి పర్యటించారు. బెల్ట్ దుకాణం నిర్వాహకుడి బాధితుడు మేకల కుమార్ కుటుంబీకులను పరామర్శించారు. కుమార్‌పై దాడి చేసిన గురవయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం ఏరులై ప్రవహిస్తోందని, ఈ మహమ్మారి గిరిజన కాలనీలోకి కూడా ప్రవేశించిందని మండిపడ్డారు. ఆడబిడ్డల తాళిబొట్టు తెంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం యానాదులపై దౌర్జన్యం చేయించిన గురవయ్యపై శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టి నిందితుడిని బైండోవర్ చేయించారు.

శిథిల పీహెచ్‌సీ

లక్షలు విలువ చేసే భవంతులు అవి.. నేడు పూర్తిగా శిథిలమైపోతున్నా పట్టించుకునే దిక్కు లేదు. ఈ భవనాలు అందుబాటులో లేక బయట అద్దె భవనాలు దొరక్క ఆరోగ్య సిబ్బంది పడుతున్న అష్టకష్టాలు అన్నీఇన్నీ కావు. ఇదంతా చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శిథిలమైపోతున్న సిబ్బంది క్వార్టర్స్ భవనాల గాథ. చిన్న పాండూరు ప్రాంతంలో 45ఏళ్ల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటైంది. అదే సమయంలో స్థానికంగా వైద్యులు, సిబ్బంది నివాసం ఉండడానికి వీలుగా ఆసుపత్రి సమీపంలో నివాస గృహాలు నిర్మించారు. అయితే కాలక్రమేణా ఆ ప్రాంతంలో కనుమరుగైన వసతులు, ఇతరత్రా కారణాలతో ఆ నివాస గృహాలు ఆదరణ కోల్పోయాయి. దీంతో నేటికీ పూర్తిగా అన్ని భవనాలు శిథిల స్థితికి చేరుకున్నాయి. లక్షల రూపాయిల విలువైన భవనాలు శిథిల దశకు చేరుకుంటున్నా సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. –వరదయ్యపాళెం

అధ్వాన్నంగా చిన్న పాండూరు పీహెచ్‌సీ సిబ్బంది నివాస భవనాలు



- దుస్థితికి చేరుకున్న చిన్న పాండూరు పీహెచ్‌సీ క్వార్టర్స్
- పట్టించుకోని వైద్య, ఆరోగ్యశాఖ
- అద్దె భవనాల కోసం అవస్థలు పడుతున్న సిబ్బంది

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే స్టాఫ్ నర్సులు, ఫీల్డ్ సిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలంటే చిన్న పాండూరు పరిసర ప్రాంతాల్లో అద్దె ఇళ్లు కరువయ్యాయి. అటు శ్రీసిటీ పారిశ్రామికవాడ ఇటు అపోలో, హీరో పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ఈ ప్రాంతంలో ఇళ్లకు ఎక్కడా లేని గిరాకీ ఏర్పడింది. దీంతో ఒక మనిషికి చిన్నపాటి సింగిల్ బెడ్‌రూమ్ ఇంటికి కూడా రూ.15 వేలకు పైగా అద్దెను వసూలు చేస్తున్నారు. అయితే కాంట్రాక్ట్ పద్ధతిలో నర్సులుగా ఉన్న వీరు అంత పెద్ద మొత్తంలో అద్దెలు చెల్లించలేక, ఇళ్లు దొరక్క అటు వరదయ్యపాళెం ఇటు సత్యవేడు మండల కేంద్రాల్లో నివాసం కోసం వెళ్లాల్సిన పరిస్థితి.

నూతన క్వార్టర్స్ భవనాలు కావాలి

ఆస్పత్రి సిబ్బందికి ఎంతో అవసరమైన క్వార్టర్స్ భవనాల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి. 24 గంటలు పనివేళల స్థాయి కలిగిన చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రౌండ్ ది క్లాక్ పద్ధతిలో వైద్యం చేపట్టాల్సి ఉంది. దీంతో సిబ్బంది అందుబాటులో ఉండాలి. దీని కారణంగా సిబ్బందికి నివాస గృహాల ఏర్పాటు తప్పనిసరి. ఈ నేపథ్యంలో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలంటే క్వార్టర్స్ భవనాల నిర్మాణం చేపట్టి తీరాలి. బయట అద్దె భవనాల్లో వైద్య సిబ్బందికి వచ్చే వేతనాల ద్వారా అద్దెలు చెల్లించలేని పరిస్థితి. పరిస్థితులను అర్థం చేసుకుని నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపాలని సిబ్బంది వేడుకుంటున్నారు.

రూ.1.90కోట్లతో నూతన భవనం

పేదల ఆరోగ్య భద్రతకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఆ దిశగా రూ.1.90కోట్లతో అన్ని హంగులతో నాడు–నేడు పథకం కింద చిన్న పాండూరు ఆరోగ్య కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించింది. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే ఆస్పత్రి సమీపంలోని సిబ్బంది నివాస భవనాలు మాత్రం శిథిల దశకు చేరుకున్నా భవనాలు మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా క్వార్టర్స్ భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



శిథిలమవుతున్న సిబ్బంది నివాస భవనాలు



నిరుపయోగంగా నీటి ట్యాంకు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన చిన్న పాండూరు పీహెచ్‌సీ భవనం

క్వార్టర్స్ భవనాలు ఎంతో అవసరం



24 గంటలు స్థాయి కలిగిన చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది నివాసాల కోసం క్వార్టర్స్ భవనాలను నిర్మించడం ఎంతో అవసరం. సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉండాలంటే తప్పనిసరిగా క్వార్టర్స్ భవనాలు నిర్మించి తీరాలి. ఈ సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించాలి. స్థానిక ప్రజలందరూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. –మహేంద్ర, ఉపసర్పంచ్, చిన్న పాండూరు గ్రామ పంచాయతీ

క్వార్టర్స్ భవనాలు తప్పనిసరి



24 గంటలస్థాయి కలిగిన చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది నివేశ అవసరాల కోసం క్వార్టర్స్ భవనాలు ఎంతో తప్పనిసరి. ఆ దిశగా నూతన క్వార్టర్స్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలి. అసలే అద్దెలు అందనంత దూరంలో ఉన్న పరిస్థితుల్లో చిన్న పాండూరు పరిసర ప్రాంతాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తక్షణమే వైద్యసిబ్బంది అవసరాల కోసం నూతనంగా క్వార్టర్స్ భవనాలను నిర్మించాలి. –మాధవయ్య, స్థానికుడు, చిన్న పాండూరు

శ్రీసిటీలో అలరించిన 'వీణా వాదన'





కళాకారిణి ప్రదర్శన, హాజరైన స్థానికులు, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ: శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం భక్తిరసభరిత వీణా వాయిద్య కచేరి భక్తులను ఎంతగానో అలరించింది. ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో యువ కళాకారిణి వాకచర్ల సుష్మా తన వీణా వాదనతో ఆలయ వాతావరణాన్ని ఆధ్యాత్మికానందంతో నింపింది. సుష్మను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు. కార్యక్రమంలో పాల్గొన్న అమెరికా డెట్రాయిట్‌కు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త భరత్ రెడ్డి కూడా సుష్మను అభినందిస్తూ జ్ఞాపికను బహూకరించి సత్కరించారు. భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాదం పంపిణీ చేశారు. శ్రీసిటీ పీఆర్‌ఓ బాలాజీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పొదుపు సంఘాలపై పచ్చనేత పెత్తనం



సమావేశమైన మహిళలు

రేణిగుంట: తూకివాకం పంచాయతీలోని పొదుపు సంఘాలపై టీడీపీ స్థానిక నేత పెత్తనం చెలాయిస్తున్నారు. తమకు అనుకూలమైన వారినే సమైఖ్య లీడర్లుగా పెట్టుకోవాలని హుకుం జారీ చేశారు. ప్రధానంగా ఎస్‌ఎన్ పురం, గంగుంట గ్రామాలకు చెందిన 30 మహిళా సంఘాలకు సంబంధించి సమైఖ్య లీడర్లను రెండేళ్లకు ఒకసారి ఎన్నుకుంటారు. గతంలో ఈ ప్రక్రియ సవ్యంగా సాగేది. అయితే ప్రస్తుతం పంచాయతీలోని పచ్చనేత జోక్యం చేసుకుంటున్నారు. టీడీపీ నేత వ్యవహారశైలిపై పొదుపు మహిళలు మండిపడ్డారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ముగ్గురు కొత్త లీడర్లను ఎన్నుకోవడం గమనార్హం.





పాంచాలినగర్‌లో అన్నదానం చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, వడ్డిమిట్టలో..

భక్తులకు అన్నదానం

రేణిగుంట: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం పలు మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. అందులో భాగంగా పాంచాలినగర్‌లో రేణిగుంట జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, గాయత్రి దంపతులు, జీఎం స్ట్రీట్‌లో శ్రీఅభయ వినాయక అసోసియేషన్ సభ్యులు, బీడీ బాలాజీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం ప్రారంభించారు. అలాగే వడ్డిమిట్టలో వినాయక టెండర్స్ అండ్ బిల్డర్స్ అధినేత కిషోర్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవం

- సీఐ నాగార్జునరెడ్డి

శ్రీకాళహస్తి: వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని వినాయక మండపాల నిర్వాహకులతో మాట్లాడారు. విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రివేళ ముగ్గురు వలంటీర్లు మండపంలో నిద్రించాలన్నారు. అలాగే బాణసంచాను మండపాల్లో ఉంచకూడదని ఆదేశించారు. గణపతి ప్రతిమల వద్ద అనుమానాస్పద వస్తువులపై నిఘా పెట్టాలని కోరారు. ఈ మేరకు మండపాల్లో ప్రతిరోజూ సోదాలు చేయాలని చెప్పారు. అలాగే వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. డీజేలు, బాణసంచా పేలుళ్లు లేకుండా నిమజ్జన వేడుకలు నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు.

శనీశ్వరునికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పౌర హక్కులపై అవగాహన



గ్రామ సభలో అధికారులు

రేణిగుంట: మండలంలోని కొత్త మంగళం దళితవాడలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఇంచార్జి ఎంపీడీఓ ప్రభురావు, ఆర్‌ఐ జయకృష్ణ పాల్గొని ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఆలయాల ప్రవేశం, అంటరానితనం నిర్మూలన, పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, వివక్ష నిర్మూలన, దాడులను అరికట్టడం, సామాజిక వెనకబాటు వంటి అంశాలను వివరించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ షణ్ముగం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి షణ్ముగం తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, పలు శాఖల అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమాచార హక్కు చట్టంలో ప్రజలు అడిగితే అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్లకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని అందించాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రజల హక్కు అని, అధికారులు ప్రజలకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఏపీఓ దేవరి, ఏఈఓ రేవతి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న నేతలు

రేణిగుంట: మండలంలోని విప్పమాని పట్టెడ పంచాయతీ తుడా లేఅవుట్‌లో నిర్మిస్తున్న నారాయణ విద్యాసంస్థ భవనం నుంచి శుక్రవారం పడిపోయి మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఏఐటీయూసీ నేతలు రూ.5లక్షల పరిహారం ఇప్పించారు. శనివారం ఈ మేరకు సీపీఐ మండల కార్యదర్శి వైఎస్ మణి ఆధ్వర్యంలో నేతలు ఘటనాస్థలం పరిశీలించారు. అనంతరం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీ వద్దకు ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి రవితో కలిసి చేరుకున్నారు. భవన కాంట్రాక్టర్ తో చర్చించి మృతుడి కుటుంబానికి నష్టపరిహారంగా రూ.5లక్షలు, దహన క్రియలకు రూ.50 వేలు ఇప్పించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. నేతలు కార్తీక్, మల్లికార్జున్, మహేంద్ర, మురళి, సెల్వ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష తగదు



మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై ఇతర కులాల వారు కుల వివక్ష చూపితే చట్టరీత్యా చర్యలు తప్పవని మండల తహశీల్దార్ శ్రీదేవి తెలిపారు. శనివారం మండలంలోని గాజులపెళ్లూరు గ్రామంలోని ఎస్టీ కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన కల్పించా. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వం కలిప్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్రవర్ణాల వారు ఎస్సీ, ఎస్టీలను చిన్న చూపు చూడకూడదని, అలా చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, ఎస్సీ బాలికల హాస్టల్ వార్డన్ సుభాషిణి, వీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'జన సురక్ష'పై అవగాహన



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్

శ్రీకాళహస్తి: మండలంలోని యార్లపూడి గ్రామంలో శనివారం పల్లం గ్రామీణ బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజరు శివానందరెడ్డి మాట్లాడుతూ రైతులు వారి పాసు బుక్‌లను ఈకేవైసీ తప్పక చేయించుకోవాలన్నారు. కుటుంబానికి రక్షణ కల్పి ంచే ప్రధానమంత్రి సురక్ష యోజన బీమా పథకానికి వయో పరిమితి 18 నుంచి 70 ఏళ్ల వరకు ఉంటుందని వివరించారు. సర్పంచ్ రఘు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం







వినాయక నిమజ్జనంలో యువకులు, బుచ్చినాయుడుకండ్రిగలో అన్నదానం, బీఎన్ కండ్రిగలో ఊరేగుతున్న వినాయకుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పలుగ్రామాల్లో శనివారం గణేష్ నిమజ్జనం కార్యక్రమం ఘనంగా జరిగింది. బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని తూర్పుమిట్ట, వినాయక వీధి, ఈబీసీకాలనీ, కారణి, నెలవాయి, పార్లపల్లి, ఆలత్తూరు, పీవీకండ్రిగ, పదో మైలు, గాజులపెళ్లూరు గ్రామాల్లో గణేష్ నిమజ్జనం కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామాలలో ఏర్పాటు చేసిన భక్తి శ్రద్ధలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి, విగ్రహాలను పూలతో అలంకరించి, నైవేద్యం పెట్టారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం వినాయక విగ్రహాన్ని ఊరేగించి, నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో మధ్యాహ్నం అన్నదానం చేశారు. బుచ్చినాయుడుకండ్రిగలోని షాపుల యాజమానులు అన్నదానం చేశారు.